పథకాల అమలులో మహిళలకే పెద్దపీట


అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకే పెద్దపీట వేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డుకు చెందిన 331 డ్వాక్రా సంఘాలకు రూ.9.96 కోట్ల 4వ విడత వైఎస్సార్ ఆసరా నిధులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలంతా ఆర్థిక స్వావలంబన సాధించి సుఖ సంతోషాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను దీవిస్తున్నారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను 99.5 శాతం అమలు చేసి మహిళా పక్షపాతిగా నిరూపించుకున్నారని కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా పేదలకు నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేయడం ద్వారా అవినీతికి తావు లేకుండా సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపి ప్రధాని మోడీ ప్రశంసలు పొందారన్నారు. కోవిడ్ – 19 సమయంలో కూడా సంక్షేమ పథకాలకు విరామం ఇవ్వని ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రూ.79.80 లక్షలతో చేపట్టనున్న కొండపేట సామాజిక భవనం, పార్కు తదితర అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీమిలి జెడ్పీ బి.రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, కొప్పల రమేష్, యూత్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, జీరు సుజాత, పందిరి విజయ్, గంట్రేటి ఈశ్వరరావు, అక్కరమాని గంగాధర్, చింతగుంట శివ, సిమ్మల ప్రసన్న, సృజన, వెంపాడ వెంకటరమణ, లెంక రమేష్, కొప్పల కృష్ణ, నీలాపు రామిరెడ్డి, చిల్ల వంశీ రెడ్డి, జీరు శ్రీనివాస రెడ్డి, చేట్ల నరసింగ్‌రెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మధురవాడ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ స్వతంత్రనగర్‌లో నిర్వహించిన సభలో 7వ వార్డులోని 315 గ్రూపులకు చెందిన 3,151 మంది లబ్ధిదారులకు రూ.8.49 కోట్ల ఆసరా చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మిని ఘనంగా సత్కరించారు.


మధురవాడలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

చంద్రబాబువి అలవికాని హామీలు

ఎన్నికలు దగ్గర పడితేనే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారని, అప్పుడు అలవికాని హామీలు ఇచ్చి తర్వాత మరిచిపోతాడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. సినిమా పార్టీ నాయకుడు కూడా ఎన్నికల సమయంలోనే వస్తాడని... తర్వాత కనిపించడన్నారు. సినిమాలు వేరు, నిజజీవితం వేరన్నారు. ఎంత మంది కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం అన్నారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏపీడీ గంగాధర్, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, వివిధ విభాగాల నాయకులు చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, పసుపులేటి గోపి, బెల్లాపు పాపారావు, పెంట్ర అప్పన్న, నెంబర్ రమణమ్మ, కాంతారావు, జగ్గపిల్లి నరేష్, పోతిన శేషుబాబు, వేగి రామిరెడ్డి, ఎల్లాజీ, అల్లాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నవరత్నాలను సూచించేలా మహిళలు తీర్చిదిద్దిన ముగ్గు

వస్త్ర వ్యాపారంతో జీవిస్తున్నాం



నేను రమాభాయి డ్వాక్రా గ్రూప్ సభ్యురాలిని. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న తాను ఇంటి వద్దే వస్త్ర వ్యాపారం చేసుకోవడానికి జీవీఎంసీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా రూ.50 వేలు సబ్సిడీ రుణం ఇచ్చారు. ఒంటరి మహిళ పెన్షన్ పథకం ద్వారా రూ.1,41,500 వచ్చింది. నా ఇద్దరు పిల్లలు పనికి వెళ్తుంటారు. నెలకు రూ.10వేల వరకు వస్త్రాలు విక్రయిస్తాను. రూ.3 వేల ఆదాయం వస్తోంది. పింఛన్ డబ్బులతో కలిపి సంతోషంగా జీవిస్తున్నాం. నా కాళ్లపై నేను నిలబడేలా చేసిన జగనన్న రుణం తీర్చుకోలేను.

– కొప్పల ఈశ్వరమ్మ, సంతపేట

ఫ్యాన్సీ సామగ్రి విక్రయిస్తున్నా



నేను వనితా గ్రూప్ సభ్యురాలిని. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని మా ఇంటి వద్ద చిన్న బడ్డీ ఏర్పాటు చేసుకుని రోజుకు రూ.1000 వరకు ఫ్యాన్సీ సామగ్రి విక్రయిస్తుంటాను. రూ.200 నుంచి రూ.300 ఆదాయం వస్తుంది. మా పిల్లలకు జగనన్న విద్యా కానుకలు, ఒకరికి రూ.30వేల విలువైన ట్యాబ్ ఇచ్చారు. మా అత్తయ్య జయలక్ష్మికి కాపు నేస్తం ద్వారా ఏడాదికి రూ.18,750 వస్తుంది. మా మామయ్య కోటేశ్వరరావుకు వైఎస్సార్ పింఛన్ కానుక నెలకు రూ.3వేలు వస్తుంది. ఆనందపురం మండలం బాకూరుపాలెంలో ఇంటి స్థలం ఇచ్చారు. మా కుటుంబానికి ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటాం.

– కంచుపర్తి అనూష, తగరపువలస

సీఎం జగన్‌కు రుణపడి వుంటాం



గత ప్రభుత్వాలు అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో విజయవంతంగా అమలుచేసి చూపించారు. నేను శ్రీకనకదుర్గ గ్రూప్ సభ్యురాలిని. నా భర్త అప్పలనాయుడుకు వాహన మిత్ర ద్వారా రూ.40 వేలు, నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.70,800, మా పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.15వేలు ప్రభుత్వం నుంచి అందాయి. పద్మనాభం మండలం తునివలసలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇలాంటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మేము గతంలో ఎక్కడా చూడలేదు. జగన్న వెయ్యేళ్లు వర్ధిల్లాలి. ఆ మహనీయునికి రుణపడి వుంటాం.

– బొట్టా అనిత, తగరపువలస

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం జంక్షన్ నర్సింహనగర్ వద్ద రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ కమ్యూనిటీ భవనం కోసం సుమారు 20 సంవత్సరాల నుంచి స్థానికులు పోరాటం చేస్తున్నారని, ఈ సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారం చూపించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేరుగు చిన్నారావు, గరికిన పరదేశి, గరికిన ఢిల్లీబాబు, దాసు కొండ, నూకరాజు, నాగరాజు, చీపుళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రఘు అధ్యాపకుడు శంకరరావుకు డాక్టరేట్


పల్లా శంకరరావు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో సహ అధ్యాపకునిగా విధులు నిర్వర్తిస్తున్న పల్లా శంకరరావుకు ఒడిశాలోని గుణుపూర్‌కు చెందిన గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ లభించింది. 'ప్రకృతి ప్రేరేపిత మెటా హ్యూరిస్టిక్ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్స్ మరియు మెషిన్ లెర్నింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి దృష్టి ఆధారిత మానవ నడక గుర్తింపు' అనే అంశంపై శంకరరావు పరిశోధన సమర్పించారు. ఈయన ప్రియదర్శన్, గుప్తేశ్వర్ సాహూ పర్యవేక్షణలో ఈసీఈ విభాగం తరపున గత నెల 29న డాక్టరేట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా శంకరరావును బెంగళూర్‌కు చెందిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు అనిల్ సహస్రబుధే తదితరులు అభినందించారు.

రెవెన్యూ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆనందపురం : విశాఖ జిల్లా రెవెన్యూ డైరీని కలెక్టర్ మల్లికార్జున బుధవారం ఆవిష్కరించినట్టు జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు తెలిపారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో డైరీని ఆవిష్కరించి పలువురు ఉద్యోగులకు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం వ్యవస్థాపకుడు ఈర్లె శ్రీరామమూర్తి, జేసీ విశ్వనాథన్, ఆర్డీవోలు హుస్సేన్, భాస్కర్ రెడ్డి, జి.దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీరుపేటలో ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటలో ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ ఇంటి ముందు ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తుండడంతో ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు సమస్యగా మారింది. అంతేకాకుండా ఆటోలను ఇళ్ల ముందు అడ్డంగా నిలపడంతో కార్లు, వ్యాన్‌లు రాకపోకలు సాగించడానికి సమస్యగా మారింది. అలాగే కేటరింగ్‌కు సంబంధించి ప్రధాన రహదారిపై నిత్యం పొయ్యి పెట్టి వంట చేస్తుండడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. భీమిలి జోనల్ అధికారులు జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని జీరుపేట వాసులు కోరుతున్నారు.

'జగనన్న సురక్ష' శిబిరం నేడు

తగరపువలస: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం 2వ విడత కార్యక్రమం గురువారం బొగ్గరోడ్డు – 2 సచివాలయం జీరుపేట వద్ద నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించే శిబిరాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రూ.38.62 లక్షలతో బస్ బే నిర్మాణం


బస్ బే నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

పీఎం పాలెం : జాతీయ రహదారిని ఆనుకుని జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ఉన్న వైజాగ్ కన్వెన్షన్ ఎదురుగా బస్ బే నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్ బే నిర్మాణానికి రూ.38.62 లక్షలు జీవీఎంసీ సాధారణ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. చుట్టు పక్కల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, మహిళలకు బస్ బే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలెం పాలకవర్గానికి అభినందనలు


సర్పంచ్ ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు నీలిమను సన్మానిస్తున్న ఎంపీపీ వాసురాజు

తగరపువలస: 'మంచి పాలనతో పంచాయతీ' విభాగంలో ఇటీవల ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకల్లో భీమిలి మండలం టి.నగరపాలెం సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమికి ఉత్తమ పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం పంచాయతీలో సర్పంచ్ ఛాయా గౌతమితో పాటు ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమను పంచాయతీ వాసులు ఘనంగా సత్కరించారు. తగరపువలస ఎల్లారమ్మ ఆలయం వరకు 300 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ విజయోత్సవ వేడుకల్లో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, సీనియర్ నాయకులు బాయిన మంగరాజు, రాజగిరి రామచంద్రరావు, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు


ఎంపీడీవో లవరాజుని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

ఆనందపురం : ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగికే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో అడపా లవరాజుని బుధవారం ప్రజాప్రతినిధుల తరఫున ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహిస్తే పేదలకు ఎంతో మేలు చేసిన వారవుతారని చెప్పారు. ఎంపీడీవోగా విధులు నిర్వహించిన లవరాజు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రజాప్రతినిధులను, అధికారులను సమన్వయం చేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో విశేష సేవలు అందించారని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లవరాజుని శాలువతో కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, పిన్నింటి వెంకట రమణ, గంట్రెడ్డి శ్రీనివాస్, కోరాడ ముసలినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

అల్లిపురం: నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల రౌడీషీటర్లపై నిఘా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ట్రాఫిక్, క్రైం, శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ రవాణాకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో రాత్రిపూట నిఘా మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.

నర్సింగరావు సేవలు అభినందనీయం


ఉపాధ్యాయుడు నర్సింగరావును సత్కరిస్తున్న హెచ్‌ఎం రాజబాబు, తదితరులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన స్కూల్ అసిస్టెంట్ చౌదరి నర్సింగరావును ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నర్సింగరావు సేవలు కొనియాడారు.

ఉపాధ్యాయుడు అప్పలరాజు మృతి


అప్పలరాజు (ఫైల్)

పద్మనాభం: ఉపాధ్యాయుడు సంబంగి అప్పలరాజు మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన అప్పలరాజు మద్ది పంచాయతీ తునిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. 2023 జూన్‌లో జరిగిన బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గాలిపాడు ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. అనారోగ్యానికి గురైన అప్పలరాజు విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

కాలనీలు పరిశీలించిన జేసీ

మధురవాడ: మధురవాడలోని రెండు కాలనీలను కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ అశోక్ మయూర్, ఇతర అధికారులు బుధవారం పరిశీలించారు. ఆడుదాం ఆంధ్ర పోటీలకు సంబంధించి క్రీడాకారుల బస నిమిత్తం సుద్దగెడ్డ, కొమ్మాది పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ కాలనీలను పరిశీలించారు. ఇక్కడ ఎన్ని కాలనీలు ఉన్నాయి, ఎన్ని గదులు ఉన్నాయి, సదుపాయలు ఎలా ఉన్నాయి, తదితర అంశాలు పరిశీలించారు. ఆయనతోపాటు భీమిలి ఆర్‌డీవో భాస్కరరెడ్డి, జీవీఎంసీ పీడీ పాపునాయుడు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పద్మనాభం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎండీఎం కార్మికులు బుధవారం పద్మనాభం మండల విద్యా శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ప్రతీ నెల ఐదో తేదీలోగా వేతనాల బిల్లు చెల్లించాలని, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని ఆందోళన చేశారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. భీమునిపట్నం డివిజన్ సీఐటీయూ నాయకుడు ఆర్.నరిసింగరావు తదితరులు, పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ


గోడౌన్‌కు వేసిన సీల్ పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, రూరల్ తహసీల్దార్ రమణయ్యతో కలసి ఆయన గోడౌన్‌కు వేసిన సీల్, లోపల ఉన్న వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి.. సిబ్బంది విధులపై ఆరా తీశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని వారిని ఆదేశించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం


శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, తదితరులు

పద్మనాభం: విద్యాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని జెడ్పీ వైస్ చైర్మన్ సుందర గిరిబాబు అన్నారు. మండలంలోని ఆర్‌పీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.15.80 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ భవన నిర్మాణానికి బుధవారం ఆయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను 'నాడు – నేడు'తో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సుందరంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధునికీకరించారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకోవడానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, ఎస్‌ఎంసీ చైర్మన్ కర్రి రామస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, మరగడ అప్పారావు, హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ స్థలంపై దుష్ప్రచారం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి

ఆనందపురం : అర్హులందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఆనందపురంలో పేదలకు అందించనున్న స్థలాలపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తూ ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి ఆరోపించారు. స్థానిక సచివాలయంలో బుధవారం ఆమె వైఎస్సార్ జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో దశలో 270 మంది నిరుపేదలకు కాలనీ ఇళ్లు మంజూరుకాగా అందుకోసం జట్లమ్మ కొండ ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కానీ కొంతమంది టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం... కొండను అక్రమంగా తవ్వుతున్నట్టు, గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ ప్రచారంతో పేదలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ ఇళ్ల అర్హుల జాబితాలో పేదలైన టీడీపీ సానుభూతిపరులు కూడా ఉన్నారని చెప్పారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు కుటిల బుద్ధిని మార్చుకుని పేదల మేలుకోసం పాటుపడాలని హితవు పలికారు. ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ, నాయకులు చందక అప్పలస్వామి, షిణగం పెద్ద రామారావు, షిణగం చిన్న రామారావు, కొట్యాడ రెడ్డిబాబు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి ఘన స్వాగతం

- థాయ్‌లాండ్‌లో వెండి పతకం సాధించిన ప్రకాష్


విమానాశ్రయంలో ప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న పాండ్రంకి రుక్మాకరరావు తదితరులు

గోపాలపట్నం: థాయ్‌లాండ్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో వెండి పతకం సాధించిన మూలపర్తి ప్రకాష్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ నుంచి బుధవారం రాత్రి విశాఖ వచ్చిన ఆయన్ని ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ పాండ్రంకి రుక్మాకరరావు, సహచర క్రీడాకారులు పూలమాలలు, శాలువలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఈ 25 నుంచి 27వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో దేశానికి వెండి పతకం అందించడం ఆనందంగా ఉందన్నారు. తనకు శిక్షణ ఇచ్చిన కోచ్ రుక్మాకరరావు, ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డానియల్ మాస్టార్, యనమరెడ్డి కనకరెడ్డి, హేమలతా రెడ్డి, అంజలిరెడ్డి, క్రీడాకారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.